సాక్షి శ్రీకాకుళం

మంగళవారం : 25 : జూన్ : 2024



టీటీడీకి మన బెల్లం

తిరుమల తిరుపతి దేవస్థానానికి నిమ్మతొర్లాడ బెల్లం వెళ్లింది. అధికారులు ఏర్పాట్లు చేశారు. - 8లో



శివారుకు నీరిస్తాం..

వంశధార కాలువను కలెక్టర్ పరిశీలించారు. శివారు భూములకు నీరిస్తామన్నారు. - 8లో



టెక్కలిలో వరుస చోరీలు

టెక్కలిలో వరుస చోరీలు జరుగుతున్నాయి. ప్రజలు భయాందోళన చెందుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

చీపురు కోత యంత్రాలు మంజూరు



మంజూరైన చీపురు కోత యంత్రాలు

సారవకోట: సీతంపేట ఐటీడీఏలోని వందన్ వికసిత్ కేంద్రం ద్వారా చీపురు కోత యంత్రాలు మంజూరైనట్లు ఏపీఎం గోవిందరాజులు తెలిపారు. స్వయం శక్తి సంఘాల్లో ఉండి చీపురు సాగు చేసే గిరిజనులకు ఈ యంత్రాలు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. ఈ యంత్రం ద్వారా ఆ గ్రామంలో ఉండే చీపురు సాగు చేసే గిరిజనులంతా వాడుకునేందుకు అవకాశం ఉందన్నారు. సంఘాల ద్వారా తీర్మానం చేసి పంపించామని ప్రస్తుతం 10 యంత్రాలు మంజూరైనట్లు ఆయన తెలిపారు. వీటిని త్వరలో ప్రజాప్రతినిధుల ద్వారా ఆయా సంఘాలకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

మహా ధర్నా విజయవంతం చేయాలి




కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దళిత సంఘాల జేఏసీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బీఆర్ఏయూ మాజీ ఉపకులపతి నిమ్మ వెంకటరావు చేపట్టిన నియామకాలు రద్దు చేయాలని కోరుతూ జూలై 1 సోమవారం ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు కోరారు. శ్రీకాకుళం నగరంలోని ఇల్లిసిపురంలో గల అంబేడ్కర్ విజ్ఞాన మందిర్‌లో సోమవారం కరపత్రం ఆవిష్కరించి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ఉపకులపతి వేసిన కమిటీల నివేదికలను తక్షణమే బహిర్గతం చేయాలని కోరారు. వర్సిటీలో తక్షణం అంబేడ్కర్ చైర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ మొత్తం ఉద్యోగుల్లో 15 మంది మాత్రమే ఎస్సీ,ఎస్టీలు ఉండడం చాలా అన్యాయమన్నారు. జూలై 1వ తేదీ నాటికి 34 మందిని తొలగించి కొత్త నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనెల అప్పారావు, సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, కులనిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బెలమర ప్రభాకర్, అంబేడ్కర్ చైర్ సాధన సమితి కన్వీనర్ టొంపల రమణ, వన్నలి లక్ష్మీనారాయణ, నేతల అప్పారావు, నేతల ఆదినారాయణ, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

'అమ్మకు వందనం ప్రభుత్వ విద్యార్థులకే ఇవ్వాలి'

జలుమూరు: జీఓ నంబర్ 117 రద్దు చేసి ప్రభుత్వ విద్యా వ్యవస్థలను బలోపేతం చేయాలని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కోరాడ వైకుంఠరావు కోరారు. ఈ మేరకు చల్లవానిపేట కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. అమ్మకు వందనం ద్వారా తల్లుల ఖాతాకు వేసే డబ్బులను ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు మాత్రమే వేయాలన్నారు. కార్యక్రమంలో మండల యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎన్.పురుషోత్తమం, గౌరవ అధ్యక్షుడు ఎస్.రాము, ట్రెజరర్ రమణ తోపాటు యూటీఎఫ్ శాఖ ప్రతినిధులు కె.రాజారావు, ఎల్.విజయ్, లక్ష్మీ, వెంకటరాజు, సంతోష్, షణ్ముఖరావు, పైల సూర్యనారాయణ పాల్గొన్నారు.

'అర్జీలపై చట్టపరంగా విచారణ చేస్తాం'



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి చట్టపరంగా విచారణ చేసి న్యాయం జరిపిస్తామని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కారం కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఈ వేదికలో మొత్తంగా 34 ఫిర్యాదులు రాగా అందులో మోసపూరితమైనవి 2, ఆస్తి నేరాలు 1, మిస్సింగ్ కేసులు 3, కుటుంబ తగాదాలు 6, సివిల్ సంబంధిత అంశాలపై 12, ఇతరమైనవి 10 ఫిర్యాదులు అందాయి. ఎస్పీతో పాటుగా అదనపు ఎస్పీలు జి.ప్రేమ్ కాజల్, వి.ఉమామహేశ్వరరావులు బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం



బీఆర్ఏయూ..

చదువుల కల్ప తరువు

- శ్రీకాకుళం విద్యార్థులకు బాసటగా బీఆర్ఏయూ
- వర్సిటీ రాకతో అందుబాటులోకి వచ్చిన ఉన్నత విద్య
- నేడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం



ఎచ్చెర్ల క్యాంపస్:

బీఆర్ఏయూ.. శ్రీకాకుళం గర్వంగా చెప్పుకునే విశ్వ విద్యాలయం. ఉన్నత విద్య అనగానే విశాఖకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితుల్లో మన గడపలోనే అన్ని రకాల ఉన్నత విద్యలను అందుబాటులోకి తీసుకువచ్చిన అపురూప సంస్థ. పీజీ సెంటర్ నుంచి విశ్వ విద్యాలయంగా రూపాంతరం చెందిన ప్రక్రియలో ఎన్నో అపూర్వ ఘట్టాలు ఉన్నాయి. వర్సిటీగా మారాక బాలారిష్టాలు దాటుకుని సమర్థమైన విద్యాసంస్థగా నిలిచింది. నేడు బీఆర్ఏయూ వ్యవస్థాపక దినోత్సవం. 2008 జూన్ 25న అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఈ విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నో ఏళ్ల పోరాటం నేపథ్యంలో ఆంధ్రా విశ్వవిద్యాలయం పీజీ సెంటర్‌గా ఉన్న ఈ సంస్థను విశ్వవిద్యాలయంగా తీర్చి దిద్దారు.

వెంటాడుతున్న సమస్యలు..

విశ్వవిద్యాలయం ఏర్పాటై 16 ఏళ్లు గడుస్తున్నా ఇంకా కొన్ని సమస్యలు ఉన్నాయి. ప్రధానంగా రెగ్యులర్ బోధకుల సమస్య ఎప్పటి నుంచో ఉంది. ప్రస్తుతం బయోటెక్నాలజీలో నలుగురు, సోషల్ వర్క్‌లో ఇద్దరు, ఎకనామిక్స్‌లో ఒకరు మాత్రమే రెగ్యులర్ సిబ్బంది ఉన్నారు. రిక్రూట్ మెంట్‌కు పలుమార్లు నోటిఫికేషన్లు జారీ చేసినా కోర్టుల్లో కేసులు, రిజర్వేషన్ రోస్టర్ సమస్యలు, ఇతర కారణాలు వల్ల పోస్టులు రిక్రూట్‌మెంట్ ముందుకు సాగలేదు. దాదాపుగా వసతి సమస్య, ఇతర పరిపాలన భవనాలు వంటి సమస్యలన్నీ పరిష్కరించారు. పూర్తిస్థాయిలో అకడమిక్ బ్లాక్‌లు, అధికారులు నివాసాలు వంటివి అవసరం.

విశ్వవిద్యాలయం యూజీసీ 12 (బి), నాక్, ఎన్ఐఆర్ఎఫ్ వంటి గుర్తింపులు సాధించింది. కొత్త యూనివర్సిటీ అయినా కొంత వరకు విద్య, వసతులు కల్పనలో మెరుగైన ఫలితాలు సాధించింది. వర్సిటీలో ఇంటర్న్‌షిప్‌ల నిర్వహణ, సామాజిక అనుసంధాన కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నారు. గ్రంథాలయ సేవలు, హెల్త్ డిస్పెన్సరీ, జిమ్ వంటి సౌకర్యాలు కల్పించారు. ఇంజినీరింగ్‌లో ల్యాబ్‌లు ఆధునీకీకరించారు. దీంతో పాటుగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వహించి, విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి కల్పన లక్ష్యంగా ప్రత్యేక శిక్షణలు ఇస్తున్నారు. వర్సిటీకి 150 ఎకరాలు ప్రభుత్వ స్థలం అప్పట్లో కేటాయించారు.

16 పీజీ కోర్సులతో..

ప్రస్తుతం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 16 పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులు, ఐదు బ్రాంచ్‌లతో ఇంజినీరింగ్ కాలేజ్, న్యాయ కళాశాల, ఎంబీఏ, ఎంసీఏ వంటి కోర్సులతో పాటు పలు డిప్లమా, పీజీ డిప్లమా కోర్సులు నిర్వహిస్తున్నారు. 106 ప్రైవేట్ డిగ్రీ, పీజీ, బీఎడ్, డీపీఈడీ, బీపీఈడీ కళాశాలలు ఉన్నాయి. 15 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. జిల్లాలో 30 వేల మంది విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తోంది. రెగ్యులర్ ఫ్యాకల్టీ ఉన్న బ్రాంచ్‌ల్లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్ సైతం అందజేస్తున్నారు.



వసతి గృహం



ఇంజినీరింగ్ కాలేజ్

మెరుగైన విద్యా ప్రమాణాలే లక్ష్యం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మెరుగైన విద్యా ప్రమాణాలు లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. పరిశోధనాత్మక విద్య లక్ష్యంగా ప్రోత్సహిస్తున్నాం. భవిష్యత్‌లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలకు ప్రాధాన్యత ఇస్తాం. ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకు వెళతాం. నాక్‌లో మెరుగైన గ్రేడ్ సాధన లక్ష్యంగా ముందుకు సాగుతాం.

– కె.ఆర్.రజని, వైస్ చాన్స్‌లర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం.

'జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసి విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. రానున్న శనివారం జరగనున్న లోక్ అదాలత్‌పై ఆయన పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. వారం రోజుల పాటు జిల్లాలోని అన్ని కోర్టుల్లో ప్రతి రోజూ రెండో పూట పోలీసు కేసులను రాజీ చేసేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. ఎక్సైజ్ కేసులపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ కేసులన్నీ రాజీ చేసుకోవాలని సూచించారు. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం సుప్రీంకోర్టు జూలై 27 నుంచి ఆగస్టు మూడు వరకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

పలాసలో అదృశ్యం.. సికింద్రాబాద్‌లో ప్రత్యక్షం



సికింద్రాబాద్ జీఆర్పీ స్టేషన్‌లో చైతన్య

కాశీబుగ్గ: పలాసలో అదృశ్యమైన విద్యార్థి తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌లో ప్రత్యక్షమయ్యాడు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న తాళ్లభద్ర చైతన్య ఈనెల 21న ట్యూషన్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి పారిపోవడంతో తల్లి విజయ తీవ్ర ఆందోళనకు గురైంది. ఇండియన్ ఆర్మీలో ఉద్యోగం చేస్తున్న తండ్రి తాళ్లభద్ర చంద్రారావు జమ్మూ కాశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. 24వ తేదీ సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో విద్యార్థి దొరికాడు.

సోషల్‌మీడియా, సాక్షి దినపత్రికలో ప్రచురణలు చూసి అనేక మంది బాలుడిని వెతికారు. ఈ నేపథ్యంలో ఆమదాలవలసకు చెందిన బీఎస్ఎఫ్ జవాన్ చైతన్యను సికింద్రాబాద్‌లో గుర్తించి పట్టుకుని తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. అనంతరం సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసు స్టేషన్‌లో సపర్యలు చేసి హైదరాబాద్‌లో ఉన్న బాలుడి బంధువులకు అప్పగించారు. బాలుడు ఎందుకు ఇంటి నుంచి వెళ్లిపోయాడో తెలియాల్సి ఉంది.

'విద్యను వ్యాపారంగా మార్చడం సరికాదు'



భవిష్యత్ కార్యాచరణ కరపత్రాన్ని చూపిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విద్యార్థులకు సక్రమంగా పాఠాలు చెప్పి విద్యాబుద్ధులు నేర్పించాల్సిన విద్యాసంస్థలు పూర్తిగా వ్యాపార సంస్థలుగా మారి పుస్తకాలు, బట్టలు, ఫీజుల పేరిట లక్షలాది రూపాయలు వసూలు చేయడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, హరీష్‌లు మండిపడ్డారు. నారాయణ విద్యాసంస్థల్లో మరీ దారుణంగా పుస్తకాలకు రూ.15వేల నుంచి రూ.20వేలు వరకు వసూలు చేస్తున్నారని, ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో గల నారాయణ విద్యాసంస్థల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని డీఈఓకు చెప్పినా పట్టించుకోలేదని తెలిపారు. నారాయణ విద్యాసంస్థల్లో విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ పుస్తకాలు, యూనిఫామ్‌లను అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. ఆ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యా శాఖ అధికారులు దీనిపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని పేర్కొన్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవచూపి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సంతోష్, తిరుపతి, కమిటీ సభ్యులు యశ్వంత్, భూపతి సాయి తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల తర్వాత..



మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జేసీ నవీన్

- ప్రజా సమస్యల పరిష్కార వేదిక పునఃప్రారంభం
- 'మీ కోసం' పేరిట ప్రజా గ్రీవెన్స్ నిర్వహణ
- అర్జీలు స్వీకరించిన అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మూడు నెలల తర్వాత ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం పునఃప్రారంభమైంది. గత ఐదేళ్లు నిర్వహించిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసి ఆ స్థానంలో నూతన ప్రభుత్వం 'మీ కోసం' పేరిట ప్రజా గ్రీవెన్స్‌సెల్‌ను తీసుకువచ్చింది. కొత్త ప్రభుత్వంలో తొలిసారిగా సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలు సత్వరం పరిష్కరించాలని జేసీ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జేసీతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, ప్రత్యేక ఉప కలెక్టర్ రామ్మోహన్ రావు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫిర్యాదుల స్వీకరణ ఈ రోజు ప్రారంభమైందని అన్నారు. మీ కోసం ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

భార్య చేతిలో భర్త హతం



టెర్రస్‌పై రక్తపు మడుగులో కుప్పయ్య మృతదేహం

- కుమారుడి మృతికి ప్రతీకారం
- గత ఏడాది జూన్ 25వ తేదీన కుమారుడిని హత్య చేసిన కుప్పయ్య
- సరిగ్గా ఏడాదిలోగా ప్రతీకారం తీర్చుకున్న వైనం
- కుప్పిలిలో కలకలం

ఎచ్చెర్ల క్యాంపస్: అనుమానం, దాడి, హత్యలు వంటి ఘటనలతో ఓ కుటుంబం ఛిద్రమైపోయింది. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త దాడికి పాల్పడడం, ఆ దాడిలో అడ్డుగా వచ్చిన కొడుకు చనిపోవడం, ఆ తర్వాత అతను జైలు జీవితం అనుభవించడం, ఏడాది తర్వాత సొంతూరికి రావడం, ప్రతీకారంతో రగిలిపోతున్న భార్య చేతిలో చనిపోవడం.. సినిమా కథను తలపించే ఈ ఘటనలకు మండలంలోని కుప్పిలి వేదికైంది. గ్రామంలో కొంద్ర కుప్పయ్య (55) అనే వ్యక్తిని ఆదివారం రాత్రి అతని భార్య హరమ్మ కత్తితో దాడి చేసి చంపేసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

గత ఏడాది జూన్ 25న కుప్పయ్య తన సొంత కొడుకునే చంపేశాడు. భార్య హరమ్మపై అనుమానం పెంచుకుని ఆ రోజు ఆమెపై కుప్పయ్య దాడికి ప్రయత్నించాడు. పెద్ద కుమారుడు తాతారావు అడ్డువచ్చాడు. దీంతో అతడిని కత్తితో నరికేశాడు. కుమారుడు సంఘటన స్థలంలోనే మృతి చెందగా, భార్య గాయాలతో బయట పడింది.



భార్యాభర్తలు కుప్పయ్య, హరమ్మ (ఫైల్)

అనంతరం పోలీసులు కుప్పయ్యను అరెస్టు చేశారు. బెయిల్‌పై బయటకు వచ్చిన కుప్పయ్య సొంతూరికి రాకుండా శ్రీకాకుళం పట్టణంలో కూలి పని చేసుకుంటూ గ్రామానికి, కుటుంబానికి దూరంగా ఉంటూ బతికాడు. అయితే కుప్పిలిలో చాలా ఏళ్ల తర్వాత అసిరితల్లి అమ్మవారి గ్రామ దేవత ఉత్సవాలు వచ్చాయి. దీంతో కుప్పయ్య గ్రామానికి వచ్చాడు. పండగ పూర్తయినా వెళ్లలేదు. దీంతో భార్య హరమ్మ అతడిని నిలదీసింది. తాను ఎక్కడకూ వెళ్లనని, ఇక్కడే వ్యవసాయం చేసుకుంటూ బతుకుతానని చెప్పాడు.

కళ్ల ముందే కుమారుడిని చంపేయడం, తనను హింస పెట్టడం వంటి సంఘటనలతో హరమ్మ భర్తపై కక్ష పెంచుకుంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి కుప్పయ్య తన ఇంటి మేడపై నిద్రపోతుండగా.. హరమ్మ అతడిని చంపేయడానికి పథకం వేసింది. ముందుగానే పదునైన కత్తిని ఇంటిలో ఉంచుకుంది. అర్ధరాత్రి దాటాక నిద్రపోతున్న వ్యక్తిపైనిర్దాక్షిణ్యంగా దాడి చేసింది. మెడ భాగమే లక్ష్యంగా దాడి చేయడంతో కుప్పయ్య సంఘటన స్థలంలోనే ఊపిరి వదిలేశాడు. అనంతరం ఆమె ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయింది. సంఘటన స్థలాన్ని జేఆర్ పురం సీఐ రామచంద్రరావు, ఎస్ఐ చిరంజీవి సిబ్బంది వచ్చి పరిశీలించారు. ప్రాథమిక దర్యాప్తు అనంతరం మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో చిన్నకుమార్తె, చిన్న కుమారుడికి వివాహాలు జరగలేదు. పెద్ద కుమారుడు హత్యకు గురయ్యాడు.

నిందితురాలికి రిమాండ్

భర్త కొంద్ర కుప్పయ్యను కిరాతకంగా హత్య చేసిన హరమ్మను ఎచ్చెర్ల పోలీసులు సోమవారం సాయంత్రం అరెస్టు చేశారు. హత్య చేసి పోలీసులకు స్వచ్ఛందంగా లొంగిపోవటంతో విచారణ అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి, అరెస్టు చేశారు. శ్రీకాకుళం జిల్లా కోర్టులో హాజరు పర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు.



చినుకు.. వణుకు

హిరమండలం:

వర్షాకాలం ప్రారంభం కావడంతో అక్కడక్కడా సీజనల్ వ్యాధుల జాడలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో పలు చోట్ల డయేరియా ప్రబలినట్లు కూడా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. జాగ్రత్తలు పాటించకుంటే రోగాల బారిన పడి ప్రాణాల మీదకు తెచ్చుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారుల సూచన

ప్రస్తుతం వాతావరణంలో మార్పులు వచ్చాయి. అక్కడక్కడా జల్లులు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో పారిశుద్ధ్యం క్షీణించి దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు, డెంగీ, మలేరియా, అతిసారం, చికున్ గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఎవరికి వారే స్వీయ జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు అధికారులు చెప్పిన సూచనలు పాటించాలని చెబుతున్నారు.

ఇలా ప్రబలుతాయి



డెంగీ : పగలు కుట్టే ఎడిస్ ఈజిప్ట్ అనే దోమ కాటుతో ఈ వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి సోకిన వారికి తీవ్రమైన జ్వరం, నొసటి తలనొప్పి, కంటి లోపల కదిలికలు తగ్గడం, కండరాళ్లు, కీళ్ల నొప్పులు, వాంతి అవుతున్నట్లు ఉండటం, నోరు ఎండిపోతుండటం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

మలేరియా: ఎనాఫిలిస్ అనే ఆడ దోమ కుట్టడం వల్ల మలేరియా సోకుతుంది. ఈ వ్యాధి సోకితే చలి జ్వరం, విపరీతమైన తలనొప్పి తదితర లక్షణాలుంటాయి.

చికున్ గున్యా : ఎడిస్ దోమ ద్వారా ఈ వ్యాధి ప్రబలుతుంది. అకస్మాత్తుగా తీవ్రమైన జ్వరం రావడం, తలనొప్పి, ఒళ్లునొప్పులు, కీళ్లనొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ఫైలేరియా: మురుగు నీటిలో పెరిగే క్యూలెక్స్ దోమ కాటుతో ఫైలేరియా వ్యాధి ప్రబలుతుంది. మురుగునీటిలో దోమ లార్వాలు వృద్ధి చెందకుండా కిరోసిన్ చల్లి దోమల లార్వాలు నాశనం చేయాలి.

నివారణకు చర్యలు

- ఇంటి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీటి తొట్టెలు, టైర్లు మురుగుకాలువల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.
- ప్రతి శుక్రవారం ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని పారబోసి డ్రైడే పాటించడం
- దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలి.
- కూలర్లు, ఫ్రిజ్‌లు, బయటపడేసిన కొబ్బరి చిప్పలు, పాతటైర్లలో నీరు నిల్వ లేకుండా చూడాలి.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



వాతావరణంలో మార్పులు రావడంతో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయి. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాల్లో రక్తపరీక్ష కిట్లు అందుబాటులో ఉంచాం. ఆశ వర్కర్లు, వైద్యసిబ్బంది ఆయా గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై పర్యవేక్షిస్తున్నారు. – సీహెచ్ సాయిగీత, వైద్యాధికారి పీహెచ్‌సీ హిరమండలం



హిరమండలం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

క్లుప్తంగా

28న తలనీలాలు, ప్రొవిజెన్స్ టెండర్లు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో వివిధ రకాల అంశాల టెండర్లు ఈనెల 28న శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఆలయ మండపంలో నిర్వహిస్తున్నట్లుగా డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ తెలియజేశారు. ఏడాది పాటు తలనీలాల వేలంతో పాటు ఆరు నెలలకు ప్రసాదాల తయారీకి (ప్రొవిజెన్స్) పచారీ సరుకుల సరఫరాకు ఈ–టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లుగా ఆయన ప్రకటించారు. తలనీలాల పాటకు రూ.5 లక్షలు, ప్రొవిజెన్స్‌కు రూ.3 లక్షల వరకు ఈఎండీ డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు 8978914660 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

దొంగతనం కేసులో ఒకరికి ఆరు నెలలు జైలు శిక్ష, జరిమానా

నరసన్నపేట: దొంగతనానికి పాల్పడిన మండలం యారబాడుకు చెందిన బమ్మిడి దేవకుమార్‌కు ఆరు నెలలు జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ స్థానిక సివిల్ జడ్జి సి.హరిప్రియ సోమవారం తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక శ్రీరామ నగర్–4 లో పల్లి బాలకృష్ణ ఇంటిలో 2019 నవంబర్ నెల 6వ తేదీన దేవకుమార్ దొంగతనానికి పాల్పడ్డాడు. ఆ మరుసటి రోజు బాలకృష్ణ పోలీసులకు ఐదున్నర తులాల బంగారు ఆభరణాలు, మూడు సెల్‌ఫోన్లు పోయినట్లు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌ఐగా ఉన్న వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులో దేవకుమార్ నిందితునిగా నిర్ధారణ కావడంతో జడ్జి ఈ మేరకు తీర్పునిచ్చారు. ఈ కేసులో ఏపీపీగా రొక్కం సంతోషి శాంతి కుమారి వ్యవహరించారు.

ఘన జీవామృతంతో ఎంతో మేలు



గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీలో ఘన జీవామృతం తయారు చేస్తున్న రైతు బుచ్చిబాబు

కొత్తూరు: ఘన జీవామృతం దమ్ములో వేయడం వల్ల వరి పంటకు ఎంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం కొత్తూరు సబ్ డివిజన్ ఎంటీ ఎస్.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని గూనభద్ర ఆర్ ఆర్ కాలనీకి చెందిన ఆదర్శ రైతు అంపిలి బుచ్చిబాబు చేత 300 కిలోల ఘన జీవామృతంను సోమవారం తయారు చేయించారు. ఘన జీవామృతం వల్ల కలిగే ప్రయోజనాలను సూర్యనారాయణ వివరించారు. ఘన జీవామృతం తయారు చేసే విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ముఖలింగం, భూదేవి, రవి, పెంటయ్య రమణమ్మలతో పాటు పలువురు పాల్గొన్నారు.

'విద్యార్థులకు మెరుగ్గా బోధించాలి'



కరవంజ మోడల్ స్కూల్, కేజీబీవీలో బోధన పద్ధతులు పరిశీలిస్తున్న ఎంఏఓ లక్ష్మీనారాయణ

జలుమూరు: విద్యార్థులు పోటీతత్వం తట్టుకునే విధంగా విలువలతో కూడిన గుణాత్మక విద్య అందించాలని జిల్లా సర్వశిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి గుంట లక్ష్మీనారాయణ అన్నారు. సోమవా రం మండల కేంద్రం కేజీబీవీ, కరవంజ మోడల్ స్కూల్‌లో బోధన తీరు పరిశీలించి సీబీఎస్‌ఈ పెడగాజీ అమలు తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లో విద్యార్థులకు బోధించే పద్ధతులపై పలు సూచనలు చేశారు. ప్రధానంగా నోట్స్ తయారు చేయడం వల్ల విద్యార్థుల్లో జ్ఞాపక శక్తి పెరుగుతుందని అన్నారు. ఇంగ్లిష్ స్థాయిని పరిశీలించి వారిలో నైపుణ్యాలు మెరుగు పరిచేందుకు పీఆర్టీలు, పీజీటీలు మరింత బాధ్యతతో పనిచేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనాల విషయంలో రాజీ పడకూడదని సూచించారు. ఆయనతోపాటు ఆయా ప్రిన్సిపాళ్లు ఎ.యశోద, డి.గణేష్ పట్నాయక్ సిబ్బంది ఉన్నారు.

కళల కాపరి



ధనుంజయరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

- జానపద కళలకు జీవం పోస్తున్న ధనుంజయరెడ్డి
- గ్రామీణ మహిళలకు కోలాటంలో శిక్షణ
- విద్యార్థులకు సంగీతంలో తర్ఫీదు
- నంది, నాట్య బ్రహ్మ అవార్డులతో సత్కారాలు

ఇచ్ఛాపురం రూరల్: పల్లె పురుడు పోసిన కళ ఇప్పుడు కాపలా కోరుతోంది. నిన్నటి తరాలు పెంచి పోషించిన నాట్య రీతులు ఆదరణ కోరుతున్నాయి. సినిమాలు, సెల్‌ఫోన్ల యుగంలో రంగస్థల వేదికపైన, వీధుల్లోన, జనాల కళ్లెదుట నిర్వహించే కళాక్రతువులను పరిరక్షించడానికి ప్రతినిధులు కావాల్సి వస్తోంది. ఇలాంటి సందర్భంలో గ్రామాల్లో జానపదానికి ప్రాణం పోస్తూ చిన్నారుల నుంచి పెద్దలు వరకు కోలాటం, సంగీతంలో ఒకవైపు శిక్షణ ఇస్తూ, మరోవైపు రాష్ట్ర స్థాయిలో ప్రదర్శనలిస్తూ సన్మాన, సత్కారాలు అందుకుంటున్నాడు తిప్పన ధనుంజయరెడ్డి.

ఇచ్ఛాపురం మండలం టి.బరంపురం గ్రామీణ ప్రాంతానికి చెందిన తిప్పన ధనుంజయరెడ్డి భారత దేశ సాంస్కృతిక ఆచార సంప్రదాయాల్లో మొదటిదైన సాంస్కృతిక కళలు కనుమరుగు కాకుండా భావి తరాలకు వాటిని అందించేందుకు తాపత్రయపడుతున్నాడు. కనుమరుగవుతున్న జానపద కళలకు జీవం పోస్తూ మహిళలకు, బాలబాలికలకు కోలాటం, పాండురంగని నృత్య రూపకం వంటి జానపద కళలను నేర్పిస్తున్నారు. మరోవైపు శాస్త్రీయ సంగీతంలో హార్మోనియం, కీబోర్డ్, వైలన్ వంటి వాయిద్యాల్లో ఆంధ్రా, ఒడిశాకు చెందిన వందలాది మంది శిష్యులకు శిక్షణ ఇస్తున్నారు.



సినీ నటుడు సమీర్ చేతులమీదుగా బంగారు నంది అవార్డు అందుకుంటున్న ధనుంజయరెడ్డి

ఇంటి నిండా అవార్డులే

- 1999 నుంచి అటు జానపదం, ఇటు శాస్త్రీయ సంగీత ప్రపంచంలో సేవలు అందిస్తున్న ధనుంజయరెడ్డి ఇంటికి వెళితే... సంగీత వాయిద్యాలతో పాటు గోడ నిండగా అవార్డులు, సన్మాన, సత్కారాల ఫొటోలే కనిపిస్తాయి.

నా జీవితం కళలకే అంకితం

నా 16వ ఏట నుంచే జానపదం, శాస్త్రీయ, సంప్రదాయ సంగీతంపై మక్కువ పెంచుకున్నాను. జానపద గురువు కప్ప నరసింహరెడ్డి వద్ద శిక్షణ తీసుకున్నాను. పదేళ్లలో ఆంధ్రా, ఒడిశాకు చెందిన వందలాది మంది కళాకారులను తయారు చేశాను. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఆసక్తి ఉన్న మహిళలకు కోలాటం నృత్యం శాస్త్రీయ సంగీతం నేర్పిస్తున్నాను. నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు కళలకే నా జీవితాన్ని అంకితం చేస్తాను.

– తిప్పన ధనుంజయరెడ్డి, జానపదం నాట్య గురువు



తనకు లభించిన అవార్డులతో తిప్పన ధనుంజయరెడ్డి

- 2021 సంవత్సరంలో శ్రీకాకుళంలో 'ఆల్ ఇండియా కళారంగం' ఆధ్వర్యంలో సినీ హాస్య నటుడు అప్పారావు చేతులమీదుగా అవార్డు, సత్కారం అందుకున్నాడు.
- 2022 ఉగాది వేడుకలో హైదరాబాద్ తెలంగాణ అక్షయసోషల్‌కల్చరల్ అసోసియేషన్ వారు 'నాట్య బ్రహ్మ' బిరుదు, అవార్డుతో సత్కరించారు.
- 2023 డిసెంబర్‌లో తెలంగాణ హైదరాబాద్‌కు చెందిన మెగా రుద్ర కల్చరల్ అసోసియేషన్‌కు చెందిన సంస్థ వారు 'బంగారు నంది' అవార్డుతో ప్రముఖ సినీ, టెలివిజన్ నటుడు సమీర్ సత్కరించారు.
- 2024 ఫిబ్రవరి నెలలో వరంగల్‌లో తెలుగు వెలుగు సాహితీ సంస్థ 'విశిష్ట కళారత్న' అవార్డుతో సత్కరించారు.
- 2024 ఏప్రిల్ నెలలో హైదరాబాద్ రెడ్డి మహాగర్జనలో 'ఉగాది పురస్కారం' అందజేశారు.
- 2024 మే నెలలో తెలుగు వెలుగు సాహిత్య సంస్థ వారు 'జాన బుద్ధ పూర్ణ' అవార్డుతో సన్మానించారు.

ఆరు మేక పిల్లలు మృతి

టెక్కలి రూరల్: మండలంలోని తిర్లంగి గ్రామంలో సోమవారం 20 మేక పిల్లలు తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. గ్రామానికి చెందిన బుడ్డ అప్పన్న, సారిపల్లి అప్పల్లుడు అనే పాడి రైతులకు చెందిన సుమారు 20 మేక పిల్లలు తీవ్ర అస్వస్థతకు గురై వాటిలో 6 మేకపిల్లలు మృతి చెందగా.. మిగిలిన 14 మేకపిల్లలు పరిస్థితి విషమంగా ఉండటంతో పశువైద్యాధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వైద్యులు మేకపిల్లలను పరిశీలించి కలుషిత ఆహారం తినడం వల్లనే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు.



మృతి చెందిన మేక పిల్లలు

అనంతరం మృతి చెందిన మేకపిల్లలను శవ పంచనామాకి తరలించి, మిగిన పిల్లలకు వైద్యం చేశారు.

తల్లిదండ్రుల చెంతకు అలిగిన యువకుడు

- ఆశ్రయం కల్పించి ఆదుకున్న గ్రామస్తులు
- బుద్ధులు చెప్పి తండ్రికి అప్పగింత



తండ్రితో ఇంటికి బయలుదేరిన హరీష్

రాజాం: తల్లిదండ్రుల మీద అలిగి ఇంటి నుంచి బయటకు వచ్చిన ఓ యువకుడు తిరిగి క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేరాడు. జీవితంపై నైరాశ్యంతో బయటకు వచ్చిన ఆ యువకుడికి రాజాం మండలం లక్ష్మీపురం యువకులు కొత్త జీవితాన్ని అందించారు. వివరాలిలా ఉన్నాయి. గుంటూరులోని బీటీఆర్ నగర్‌కు చెందిన ఇంటర్మీడియట్ చదువుతున్న హరీష్ ఇంటివద్ద అలిగి నెలరోజుల క్రితం బయటకు వచ్చేశాడు. తండ్రి కోలా విజయబాబు ఓ హోటల్‌లో టీ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. తనలా కాకుండా ఉన్నత చదువులు చదవాలని హరీష్‌కు నచ్చజెప్పి చదివిస్తున్నాడు. తండ్రి మాటలు ఇబ్బందికరంగా ఊహించుకున్న హరీష్ ఇల్లు వదిలి బయటకు వచ్చేశాడు. ట్రైన్‌లో ప్రయాణం చేస్తూ హరీష్ జీవితంపై నైరాశ్యాన్నీ ప్రదర్శించడంతో అదే ట్రైన్‌లో ప్రయాణిస్తున్న రాజాం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన టి. సంతోష్‌తో పాటు మరికొంతమంది చీపురుపల్లి వద్ద ఆ యువకుడి పరిస్థితి గమనించారు. మెల్లగా మాటల్లో దించి ఆకలితో ఉన్న హరీష్‌కు భోజనం పెట్టించి తమ గ్రామానికి తీసుకొచ్చారు. కొద్దిరోజులు ఇక్కడ ఉంచి అనంతరం యువకుడి గురించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఎన్ని మంచి బుద్ధులు చెప్పినా తల్లిదండ్రుల వద్దకు వెళ్లనని అనడంతో హరీష్‌కు కష్టం విలువ తెలిసేలా చేయాలని యువకులు ఆలోచించారు. గ్రామస్తులతో పాటు పనిచేసుకునేలా హరీష్‌ను పనిలో పెట్టారు. దీంతో కష్టం విలువ తెలుసుకున్న యువకుడు అక్కడ పనిచేయలేక లక్ష్మీపురం గ్రామానికి తిరిగివచ్చి తల్లిదండ్రుల చెంతకు వెళ్లేందుకు ఒప్పుకున్నాడు.

సోషల్ మీడియాలో ప్రచారంతో ఫలితం

ఈలోగా లక్ష్మీపురం యువకులు అంతా ఈ యువకుని వివరాలు వాట్సాప్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ యువకుడి వివరాలు గుంటూరులోని తల్లిదండ్రుల వద్దకు చేరాయి. ఫోన్ ద్వారా తమ కుమారుడి యోగాక్షేమాలు తెలుసుకున్న తల్లిదండ్రులు విజయబాబు, సీతమ్మలు కుమారుడిలో మార్పుకోసం తాపత్రయపడ్డారు. హరీష్‌లో మార్పు వచ్చి ఇంటికి వెళ్లిపోతానని చెప్పడంతో అతని తండ్రిని లక్ష్మీపురం రప్పించి, గ్రామపెద్దల సమక్షంలో యువకులు రెండురోజుల క్రితం అప్పగించారు. దీంతో హరీష్ కథ సుఖాంతం అయ్యింది. ఆ యువకునిలో మార్పు తీసుకొచ్చిన గ్రామానికి చెందిన యువతను గ్రామస్తులు అభినందించారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని వినతి

పొందూరు: గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్‌ఏ) సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు తెండేల త్రినాథరావు సోమవారం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌లను కలిసి వినతి పత్రం అందించారు. అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రులను మర్యాదపూర్వకంగా సంఘ సభ్యులతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, అర్హత ఉన్న వారికి వీఆర్‌ఓలుగా ప్రమోషన్ కల్పించాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా గుర్తించాలని కోరారు. మంత్రులను కలిసిన వారిలో వీఆర్‌ఏ సంఘ సభ్యులు షేక్ బందగీషాహెబ్, కె.రవికుమార్, జి.వెంకన్న తదితరులు ఉన్నారు.



పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసిన జిల్లా వీఆర్‌ఏల సంఘం సభ్యులు

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

రణస్థలం: మండలంలోని కొవ్వాడ గ్రామానికి చెందిన వాసుపల్లి తోటయ్య (48) ఇంటి వద్ద మెట్లపై జారి పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మృతుడు తోటయ్య ఈ నెల 19వ తేదీన ఇంటి వద్ద మెట్లపై నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఆస్పత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదివారం అర్ధ రాత్రి చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఏఎస్‌ఐ ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

భూసార పరీక్షలతో ఎంతో మేలు



హిరమండలం రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి సంధ్య

హిరమండలం: వరి సాగులో విత్తన ఎంపిక కీల కమని వ్యవసాయశాఖ అధికారి బి.సంధ్య అన్నా రు. ఆమె సోమవారం కల్లట రైతు భరోసా కేంద్రం పరిధిలో వరి విత్తనాలు చల్లుతున్న రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ విత్తన శుద్ధి తప్పనిసరి అని తెలిపారు. ముందుగా భూసార పరీక్షలు చేసుకుంటే ఎంతో మేలని పేర్కొన్నారు.

మండలానికి ఈ ఖరీఫ్‌లో 377 మట్టి నమూనా శాంపిళ్ల టార్గెట్ ఇవ్వడం జరిగిందన్నారు. వీటిని ఆమదాలవలస ఎస్‌టీఎల్‌కు పంపించి అనాలసిస్ చేసి మట్టి నమూనా ఫలితాలు రైతులకు అందిస్తామని పేర్కొన్నారు. రైతులు మట్టి పరీక్షల ఫలితాలను అనుసరించి ఎరువులు వాడాలని సూచించారు. అనంతరం విత్తన శుద్ధి, సస్యరక్షణ, ఇతరత్రా విషయాల్లో సైతం రైతులు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. నేరుగా వరి విత్తనాలు చల్లుకున్నప్పుడు, ఎదలు వేసుకున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి, రైతుభరోసా సిబ్బంది పాల్గొన్నారు.

శివారు భూములకు సాగునీరిస్తాం..



సుభద్రాపురం వద్ద ఎడమ ప్రధాన కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్
- వంశధార ఎడమ ప్రధాన కాలువ పరిశీలన

నందిగాం: వంశధార ఎడమ ప్రధాన కాలువ ద్వారా ఈ ఖరీఫ్ సీజన్‌లో శివారు భూములకు సాగునీరు అందివ్వడమే లక్ష్యంగా కాలువలో పనులు చేపట్టినట్టు కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఆయన సోమవారం మండలంలోని సుభద్రాపురం నుంచి కణితూరు వరకు కాలువలో యంత్రాలతో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వంశధార ఈఈ శేఖర్‌రావును కాలువలో ఉన్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకొని వాటిని ప్రత్యక్షంగా పరిశీలించారు. కాలువలో మూడు చోట్ల అండర్ టన్నెల్‌లో ఏర్పడిన రంధ్రాలను, పాక్షికంగా చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. అలాగే సుభద్రాపురం ఎత్తిపోతల పథకం పనిచేయకపోవడం వల్ల సుమారు 400 ఎకరాలకు సాగునీరు లభించడం లేదని, ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించి ఆదుకోవాలని సుభద్రాపురం, నరేంద్రపురం సర్పంచ్‌లు బోరుభద్ర సోమేశ్వరరావు, బోకర సన్యాశిరావులు కలెక్టర్‌ను కోరగా ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. అలాగే పలు డిస్ట్రిబ్యూటర్ చానెళ్లను పరిశీలించి వాటిని ఉపాధి హామీ వేతనదారులతో పని చేయించాలని ఎంపీడీఓ రాజారావుకు సూచించారు. అలాగే కణితూరు వద్ద కాలువలో కలుస్తున్న గ్రామానికి చెందిన మురికి నీటి కాలువకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎడమ ప్రధాన కాలువ ద్వారా శివారు భూములకు సాగునీరు అందించే ఉద్దేశంతో ప్రత్యేక నిధులు విడుదల చేసి పనులు చేయిస్తున్నామని, పనులు పూర్తయిన తర్వాత సాగునీరు విడుదల చేస్తామని తెలిపారు. ఆయన వెంట పలాస ఆర్డీఓ భరత్ నాయక్, వంశధార ఎస్‌ఈ రాంబాబు, ఈఈ శేఖర్‌రావు, డీఈ శ్రీకాంత్, ఏఈ అభిషేక్ , తహసీల్దార్ వి.పద్మావతి, ఎంపీడీఓ టి.రాజారావు, సర్వేయర్ జోగారావు, వంశధార ప్రాజెక్టు చైర్మన్ మళ్ల బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

తండ్యాం మెట్ట గుడిలో చోరీ

పొందూరు: మండలంలోని తండ్యాం పంచా యతీ మెట్ట కాలనీలోని దుర్గగుడిలో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు గుడిలో ఉన్న హుండీని తీసుకువెళ్లి అందులోని నగదును దోచుకున్నారు. హుండీలో సుమారు రూ. 30 వేలు వరకు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నగదు దోచుకుని హుండీని సమీపంలోని పొలాల్లో విడిచి పెట్టేశారని కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దుర్గగుడిని పరిశీలించి కేసు నమోదు చేశారు.

మృతుని కుటుంబానికి భారీ సాయం

ఇచ్ఛాపురం రూరల్: కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉండాల్సిన వ్యక్తి అర్థాంతరంగా తనువు చాలిస్తే, ఆ కుటుంబానికి మేమున్నామంటూ చుట్టు పక్కల వారు అండగా నిలిచారు. తమకు తోచిన సాయాన్ని అందించి పెద్ద మనసు చాటుకున్నారు. మండలం సన్యాసిపుట్టుగ గ్రామం దళితవాడకు చెందిన నందూరి శంకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్పందించిన గ్రామ మహిళలు రూ.23వేలు ఆర్థిక సాయం చేయగా, గ్రామ యువత రూ.73,320 లను సేకరించి మొత్తం రూ.96,320లతో పాటు మూడు క్వింటాళ్ల బియ్యాన్ని సోమవారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి సల్ల దేవరాజు, మాజీ సర్పంచ్ నీలాపు చంద్రయ్య, ఉప సర్పంచ్ నీలాపు గోపి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న సన్యాసిపుట్టుగ గ్రామస్తులు

బతుకు 'దారి'



విశాలమైన రోడ్లు, అతి తక్కువ ట్రాఫిక్‌తో కనిపిస్తున్న ఈ ప్రాంతం మందస మండల కేంద్రంలోనిది. సోమవారం సంత కోసం వ్యాపారులంతా తమతమ స్థలాలు చూసుకోవడంతో.. ఈ వృద్ధుడు రోడ్డు మధ్యలో ఇలా ఎండలో మట్టి కుండలు విక్రయిస్తూ కనిపించారు.

– కాశీబుగ్గ

బ్యాంకు మేనేజర్ ఇంట్లో చోరీ

టెక్కలి రూరల్: టెక్కలిలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. సోమవారం వంశధార కాలనీలో నివాసముంటున్న ఒక బ్యాంకు మేనేజర్ ఇంట్లో చోరీ జరిగిందని స్థానికులు గుర్తించారు. బ్యాంకు మేనేజర్ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దొంగలు చోరీకి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మేనేజర్ భార్య కోడూరు జయశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇంటిలో 5తులాల బంగారు ఆభరణాలతో పాటు కిలో వెండి వస్తువులు చోరీకి గురైనట్లు తెలిపారు. టెక్కలి ఎస్‌ఐ లక్ష్మి కేసునమోదు చేసినట్లు తెలిపారు.

వరుస చోరీలతో భయాందోళన

టెక్కలి రూరల్: టెక్కలి పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా దొంగతనాలు జరుగుతుండడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల వ్యవధిలోనే ఇక్కడ మూడు దొంగతనాలు జరిగాయి. ఈ నెల 17వ తేదీన ఒక బంగారం దుకాణంలో మూడు తులాల బంగారం గొలుసును పట్టపగలే చోరీ చేశారు. ఆ ఘటన మరువకు ముందే శ్రీనివాస నగర్‌లో ద్విచక్రవాహనం దొంగిలించారు. అలానే 23వ తేదీన ఆదివారం వెంకటేశ్వర కాలనీ–3 సీఆర్‌ఎఫ్ ఏఎస్‌ఐ ఇంటిలో జరిగిన చోరీలో సుమారు తులం బంగారం పోయింది. సోమవారం సైతం వంశధార కాలనీలో ఉన్న ఒక బ్యాంకు ఉద్యోగి ఇంటిలో చోరీ జరిగినట్లు పోలీసులు గుర్తించారు.

టీటీడీకి మన బెల్లం

ఆమదాలవలస: మండలంలోని చేపేనపేట, నిమ్మ తొర్లాడ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం పద్ధతుల్లో సాగు చేస్తున్న చెరుకు నుంచి తయారుచేసిన బెల్లాన్ని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రేవతి సమక్షంలో తిరుమల తిరుపతి దేవస్థానానికి సోమవా రం పంపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేపేనపేట, నిమ్మతొర్లాడ గ్రామాల నుంచి పది టన్నుల బెల్లాన్ని తిరుపతి దేవస్థానానికి పంపించినట్లు తెలిపారు. అలాగే ఈ సంవత్సరంలో రెండు దఫాలుగా 20 టన్నుల బెల్లాన్ని ఇక్కడ నుంచి తిరుపతి దేవస్థానానికి పంపించినట్లు పేర్కొన్నారు. నిమ్మతొర్లాడ గ్రామంలో నక్క దామోదర్ రావు అనే రైతు పూర్తిగా తనకున్న వ్యవసాయ భూమిలో ప్రకృతి సేద్యంలో చెరుకు పంటను సాగు చేస్తూ మిగతా రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. అలాగే మారుమూల గ్రామం నుంచి ప్రకృతి సేద్యంలో తయారుచేసిన పంటలను రాష్ట్ర నలుమూలలకు ఎగుమతి చేయడం వల్ల రైతులకు అదనపు ధర వచ్చి మంచి ఆదాయం కూడా లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఏ శ్రీనివాస్, మార్కెటింగ్ ఎస్‌ఎఫ్‌ఏ శివాజీ,మాస్టర్ ట్రైనర్ శోభన్, యూనిట్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చిరంజీవి,తిరుపతిరావు, లక్ష్మి, కృష్ణవేణి, జానకిరామ్, గ్రామ సర్పంచ్ సత్యరాజ్, నాయకులు ఉదయ్ తదితర రైతులు పాల్గొన్నారు.



తిరుపతి దేవస్థానానికి బెల్లం పంపిస్తున్న అధికారులు